క్లుప్తంగా

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ



మాట్లాడుతున్న జేఎస్ఎస్ పీఓ సుధాకర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: చేతి వృత్తులను నేర్చుకుంటే మహిళలు కుటుంబానికి ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉండవచ్చని జనశిక్షణ్ సంస్థాన్ పీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్లపల్లెలో జనశిక్షణ్ సంస్థాన్ (తిరుపతి) మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించింది. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు అనుభవజ్ఞులైన వారితో టైలరింగ్‌తోపాటు పెయింటింగ్, ఎంబ్రాయిడరీ ఇత్యాది వాటిపై శిక్షణ ఇస్తామని, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చలపతి, సిబ్బంది పాండు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ హర్షితరెడ్డి

ఏర్పేడు: స్థానిక శివ పబ్లిక్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో శనివారం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, రేణిగుంట అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఏర్పేడు, సీతారాంపేట, నచ్చనేరి, నాగంపల్లె, బాలకృష్ణాపురం, అంజిమేడు, మేర్లపాక, సీతారాంపేట తదితర గ్రామాల నుంచి వచ్చిన 150 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. స్కూలు డైరెక్టర్ ప్రసన్న, డాక్టర్లు హర్షితరెడ్డి, రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఐకు ప్రశంసా పత్రం



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఏఎస్ఐ లోకనాథం

కేవీబీపురం: కేవీబీపురం ఏఎస్ఐ లోకనాథం జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడంతోపాటు కరోనా సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఎస్పీ తనకు ప్రశంసా పత్రం అందజేశారని ఏఎస్ఐ తెలిపారు. ఆయన్ను కేవీబీపురం అధికారులు, పోలీసు సిబ్బంది అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: మండలంలోని పెనుమల్లం వద్ద శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ముక్కంటీశుని దర్శించుకున్న మాజీ కమిషనర్



శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ముక్తేశ్వరరావు

శ్రీకాళహస్తి: రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మాజీ కమిషనర్ ముక్తేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. స్వామి,అమ్మవార్ల దర్శనానంతరం ఆయనకు ఆలయంలోని గురుదక్షిణామూర్తి వద్ద వేదపండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు పలికారు. శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు, జ్ఞాపికను బహూకరించారు. ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



అమరావతి (ఫైల్)

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం శ్రీకాళహస్తిలో చోటుచేసుకుంది. 1వ పట్టణ ఎస్ఐ తిమ్మయ్య కథనం... పట్టణ శివారు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు డోలు వాయిద్యంపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన భార్య అమరావతి (55) కుమారుడు రూప్ కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై శనివారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు ఇంటి నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో పానగల్ నక్కల కాలువ వంతెనపై వెళ్తుండగా అమరావతి ద్విచక్రవాహనం నుంచి అదుపు తప్పి రోడ్డు మీద పడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న లారీ ఆమెను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతియుత జీవనమే ఇస్లాం ప్రబోధం

శాంతియుతంగా జీవనం సాగించాలని ఇస్లాం మతం ప్రబోధిస్తోందని, ఇస్లాం నియమాలు పాటిస్తూ, పేదలకు అండగా ఉంటూ, అందరితో సోదరభావంతో మెలగాలని ముస్లిం మతపెద్దలు ప్రబోధించారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని శ్రీకాళహస్తి, సత్యవేదు నియోజకవర్గాల వ్యాప్తంగా పలుచోట్ల ఈద్గా మైదానాలు, మసీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.

- ముస్లిం మత పెద్దల ధార్మికోపన్యాసం
- భక్తిశ్రద్ధలతో రంజాన్
- పెద్ద సంఖ్యలో ముస్లింల సామూహిక ప్రార్థనలు



శ్రీకాళహస్తిలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఈద్గాలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండుగ విశిష్టత, అల్లా కరుణ గురించి ప్రసంగించారు. ప్రధాన ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు ముస్లిం మత పెద్దలు సాదర స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించారు. మతపెద్ద నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అల్లా దయ, కరుణ అందరిపై ఉండాలని, సుఖశాంతులతో అందరూ కలసి మెలసి జీవించాలని ఆకాంక్షించారు. మైనారిటీల సంక్షేమానికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని, ముస్లింల దీవెనలు ఆయనకు మెండుగా ఉండాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రతి ఏటా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్నానని, అలాగే కరోనా సమయంలో కూడా రంజాన్ పండుగకు ప్రతి ముస్లిం కుటుంబానికి నిత్యావసర సరుకులు, చికెన్, చీరలు అందజేశానని వారితో పంచుకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. తన నియోజకవర్గంలో పేద ముస్లింలు వివాహం చేసుకుంటే వారికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మేమమామ సాంగ్యంగా డబుల్‌కాట్ మంచం, బీరువా, టీవీ, ఫ్రిడ్జ్ ఇస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గవ్యాప్తంగా ముస్లింలకు తాను చేసిన సేవా కార్యక్రమాలను ఉదహరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు సిరాజ్‌బాషా, గోరా, ఫజల్, గయాజ్, పఠాన్ ఫరీద్, బాబు, బావాజి, జిలానీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో..

రేణిగుంట: స్థానిక బాలికోన్నత పాఠశాల సమీపంలోని దర్గాలో ముస్లింలు అధిక సంఖ్యలో సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ధార్మికోపన్యాసం చేశారు. రేణిగుంటలో మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఖదీర్ ఆధ్వర్యంలో శీతల పానీయాలు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని తారకరామానగర్‌లో ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు వైఎస్సార్ సీపీ నాయకుడు మన్యం శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. గురవరాజుపల్లెలో రహీం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట, ఏర్పేడు, అంజిమేడు, మాధవమాల, కుమ్మరికండ్రిగ, ఎండీపుత్తూరు, మర్రిమంద తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాకు వెళ్లి మత గురువుల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు.

సత్యవేదు నియోజకవర్గం

వరదయ్యపాళెం: రంజాన్ మాసంలో ఉపవాసాల దీక్షల విరమణ అనంతరం మసీదులో, స్థానిక ఈద్గా మైదానం వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ప్రసంగిస్తూ ఉపవాస దీక్షల మూలాన మనస్సు, శరీరం శుభ్రపడుతాయని, కొత్త ఆలోచనలు, శాంతియుత జీవనం, సోదరభావంతో మెలిగేందుకు దేవుడు సహాయపడతారని తెలిపారు. పరస్పరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గౌసియా నగర్, ముస్లింపాళెం, సంతవేలూరు, గోవర్ధనపురం, పెద్ద పాండూరు, కదూరు గ్రామాలలో ముస్లింలు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట, కాటూరు, గాజులపెళ్లూరు, గ్రామాల్లోని మసీదుల్లో మతగురువుల ఆధ్వర్యంలో ముస్లింలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదులను ప్రత్యేకంగా అలకరించారు.

పిచ్చాటూరు, నాగలాపురంలో..



రేణిగుంట: తారకరామానగర్‌లో..



ఏర్పేడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వరదయ్యపాళెంలో..

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండల కేంద్రాలతోపాటు కీళపూడి, రామాపురం, టీపీ కోట గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేశారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. కీళపూడికి చెందిన మత పెద్ద సాదిక్ బాషా మాట్లాడుతూ, ఈ ఏడాది కూడా వర్షాలు పుష్కలంగా కురిసి అరణియార్ నీటితో కళకళలాడాలని, అన్నీ మతాల వారు కలిసిమెలిసి జీవించాలని అల్లాను ప్రార్థించినట్లు చెప్పారు. నాగలాపురంలో ఎస్ఐ హనుమంతప్ప ముస్లింలకు చాక్లెట్లు పంచి రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు.



ఏర్పేడు : పాపానాయుడుపేటలో ..



బుచ్చినాయుడుకండ్రిగలో..



నాగలాపురం : నమాజు చేస్తున్న చిన్నారులు

టీటీడీ కల్యాణ మండపం భూమిపూజకు రండి



తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- మంత్రి, కలెక్టర్, ఎస్పీలకు ఎమ్మెల్యే ఆహ్వానం

పిచ్చాటూరు: సత్యవేదులో ఈ నెల 27న టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణ భూమిపూజకు రావాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని శనివారం ఆహ్వానించారు. ఉదయం 10 గంటలకు తిరుపతిలోని మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. అనంతరం కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, జేసీ బాలాజి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిని వారి కార్యాలయాల్లో కలిసి ఆహ్వానించారు. తాము కోరిన వెంటనే కల్యాణ మండపం మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

సురుటుపల్లె–దాసుకుప్పం బైపాస్ రోడ్డుకు రూ.27 కోట్లు మంజూరు

నాగలాపురం మండలం సురుటుపల్లె నుంచి సత్యవేదు మండలం దాసుకుప్పం వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.27 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే తమిళనాడు మార్గంలో కాకుండా నేరుగా ఆంధ్రప్రదేశ్ భూభాగంలోనే సత్యవేదుకు రోడ్డు మార్గం ఉంటుందని, ఇది సత్యవేదు ప్రజల చిరకాలవాంఛ అని ఆయన చెప్పారు. రోడ్డు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఎమెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పిచ్చాటూరులో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

ఆదివారం పిచ్చాటూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఉదయం 8 గంటలకు మంత్రి స్థానిక టీచర్స్ కాలనీలోని శ్రీ నాగాలమ్మ ఆలయ కుంభాభిషేకంలో పాల్గొంటారని చెప్పారు.

అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

ఏర్పేడు: తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి స్వగ్రామమైన మండలంలోని మన్నసముద్రంలో అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణానికి శనివారం మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ చొరవతో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.25 లక్షల నిధులు వాటర్ ట్యాంకు నిర్మాణానికి మంజూరయ్యాయి. సర్పంచ్ వనజ, ఎంపీ మాతృమూర్తి రమణమ్మ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు తాళ్లపాక నాగార్జునరెడ్డి, ఎఫ్‌పీఓ సీఈఓ నాగభూషణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మాధవయ్య, గిరిబాబు, సురేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి, మునికృష్ణ, చరణ్, కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జ్ఞానాంబవారి మధు



జ్ఞానంబవారి మధు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జ్ఞానాంబవారి మధు(దాస్)ను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్‌చైర్మన్‌గా శ్రీకృష్ణ, సభ్యులుగా నాదమునిరెడ్డి, కన్నమ్మ, సి.మంజుల, అంబుజ, రఘుకేశవరెడ్డి, సుబ్రమణ్యం, దుర్గయ్య, హేమలత, కోటయ్య, సరస్వతి, అమరావతి, సుజాత, మునిరాజలను నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఏడాది పాటు ఈ పాలకవర్గం పనిచేస్తుంది. మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వ్యవహరిస్తారు. తనపై ఎమ్మెల్యే ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని మధు చెప్పారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

కేవీబీపురం: బుచ్చినాయుడు కండ్రిగ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మండలంలోని పాత పాళెంకు చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ నేత హరిబాబు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆయనను ఎంపీపీ మునిలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్టీ నేతలు, బీసీ నేతలు సత్కరించారు. కార్యక్రమంలో మహిళా నేతలు బొర్రా మాధవీరెడ్డి, రమాదేవి, నేతలు నందకుమార్, లాల్ బాబు, రామ్మోహన్‌వర్మ, ప్రేమ్‌కుమార్, జాకీర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



హరిబాబును సన్మానిస్తున్న నాయకులు

భక్తిప్రపత్తులతో గురు సంచార పూజలు



శ్రీ దాంపత్య దక్షిణామూర్తికి హారతి ఇస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు



పళ్లికొండేశ్వరాలయంలోని గురు భగవాన్ విగ్రహం

పిచ్చాటూరు: శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరాలయంలో శనివారం గురు సంచార పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. శనివారం రాత్రి 11.24 గంటలకు గురు భగవాన్ మీన రాశి నుంచి మేష రాశిలోకి ప్రవేశించడాన్ని పురస్కరించుకుని నవగ్రహ గురుభగవాన్‌కు పరిహార సంకల్పం, విశేష హోమాలు, అభిషేక పూజలు చేశారు. భక్తులు పరిహార పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఆలయంలోని శ్రీ దాంపత్య దక్షిణామూర్తికి అర్చకులు విశేష పూజలు చేశారు.

ఐఐటీ తిరుపతిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక రెవెన్యూలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ద్వారా 120 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ నేతకు మాతృ వియోగం

పిచ్చాటూరు: వైఎస్ఆర్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి జేబీఆర్ మునిరత్నం మాతృమూర్తి కమలమ్మ(80) శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ సాయంత్రం మృతురాలి స్వగ్రామమైన నాగలాపురం మండలం కారణి గ్రామానికి వెళ్లి కమలమ్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేబీఆర్ మునిరత్నంను, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. అనంతరం నాగలాపురంలో రెండు వారాల క్రితం మృతి చెందిన మాజీ ఎంపీపీ భర్త విజయకుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు అపరంజిరాజు(నాగలాపురం), సుశీల్ కుమార్ రెడ్డి(సత్యవేదు), జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్ఎం సురేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కారణిలో కమలమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కార్యకర్త మృతికి సంతాపం

నారాయణవనం: స్థానిక ఒకటో వార్డుకు చెందిన క్రియాశీలక వైఎస్సార సీపీ కార్యకర్త శరవణభవ(53) శనివారం ఉదయం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కోనేటి బాబు, పలువురు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అకాల వర్షం..తీవ్ర నష్టం



తడిసిన మిరపకాయలను ఎండబెడుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి మిరప, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. 120 ఎకరాల్లోని మామిడి పంట, 20 ఎకరాల్లోని మిరప పంట పూర్తిగా దెబ్బతింది.

ట్రాన్స్‌కోకు రూ.8 లక్షల నష్టం

అకాల వర్షంతోపాటు పెనుగాలులకు 4 ట్రాన్స్‌ఫార్మర్లు, 26 విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. గాలికి స్తంభాలు విరిగిపోవడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడంతో పలు గ్రామాల్లో విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. ఈఈ వాసురెడ్డి, డిప్యూటీ ఈఈ సతీష్‌బాబు సహకారంతో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తూ, సరఫరా పునరుద్ధరణ చేస్తున్నామని ఆయన తెలిపారు.



నేలరాలిన మామిడి కాయలు

శాస్త్రోక్తంగా కుంభాభిషేకం



నాగాలమ్మ గుడిలో గోపూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

పిచ్చాటూరు: నాగాలమ్మ గుడి కుంభాభిషేకం శనివారం వేడుకగా ప్రారంభమైంది. ఉదయం గణపతి పూజ, వాస్తు శాంతి, వాస్తు హోమం, ఆలయ శుద్ధి, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన కార్యక్రమాలు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం గోపూజ, యాగశాల పూజ, అంకురార్పణం, కలశపూజ తదితర కార్యక్రమాలు చేశారు. కుంకుమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి 9 గంటలకు నవగ్ర మండపంలో నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రదక్షిణం, మహా కుంభాభిషేకం అనంతరం అలంకారం, మహా హారతి ఉంటుందని, అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు పాట కచేరీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.